

విజయ్ దేవరకొండ

## రౌడీల బెండుతీసే ఫ్యామిలీస్టార్

'లైన్లో నిలబడి ఉల్లిపాయలు తేవడాలు, టైమ్‌కి లేచి పిల్లల్ని రెడీ చేసి స్కూల్‌కి పంపించడాలు అనుకున్నావా మగతనం అంటే'.. అన్నాడు విలన్ ఎగతాళిగా.. 'భలే మాట్లాడతారన్నా మీరంతా.. ఉల్లిపాయలు కొంటే ఆడు మనిషికాదా.. పిల్లల్ని రెడీ చేస్తే ఆడు మగాడు కాదా.. ఐరెన్ వంచాలా ఏంటి? అని కూల్‌గా.. ఆ పక్కనే ఉన్న విలన్ మనిషి తలని ఫ..ట్ మని పగలగొట్టేశాడు. అందరూ షాక్.. 'సారీ బాబాయ్.. కంగారులో కొబ్బరికాయ తేవడం మర్చిపోయా.. తలకాయ కొట్టేశా..' అందరూ అర్థంకానట్టు చూస్తున్నారు. టీజర్ ఎండ్.. బావున్నాయి కదూ డైలాగులు. ఇవి మన విజయ్ దేవరకొండ హీరోగా పరశురామ్ తెరకెక్కిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' సినిమా టీజర్‌లోనివి. ఈ డైలాగుల్ని బట్టి హీరో కేరక్టరైజేషన్ చెప్పేయొచ్చు. దానికి తగ్గట్టుగా 'ఫ్యామిలీ స్టార్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు మేకర్స్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది ఈ సంస్థ నుంచి వస్తున్న 54వ సినిమా. బుధవారం ఈ చిత్రం టైటిల్ టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంట్లో పనులు చేసే ఫ్యామిలీమ్యాన్‌లా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌లా ఇందులో దేవరకొండ విజయ్ కనిపిస్తాడని దర్శకుడు పరశురామ్ చెప్పాడు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తున్న ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతికి విడుదల కానుంది.

## నవ్వించే రాజకీయ సినిమా



నరేష్

'మార్టిన్ లూథర్ కింగ్'.. ఇందులో కింగ్ ఎవరనేది సినిమా చూసి తెలుసుకుంటేనే బావుంటుంది. సందేశంతో కూడిన వినోదభరిత చిత్రంగా పూజా కొల్లూరు తెరకెక్కించారు. డైరెక్టర్‌గా తనకు మంచి పేరు తెచ్చే సినిమా ఇది. 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' నుంచి వెంకటేశ్ మహా తెలుసు. తను మంచి దర్శకుడే కాదు, మంచి రచయిత కూడా అని రుజువు చేసే చిత్రమిది. ఎంతో నమ్మకం ఉంటేగానీ ముందుగానే ప్రేక్షకులకు చూపించి సినిమాను విడుదల చేయరు. వరంగల్ ప్రీమియర్‌లో జనంమధ్య ఈ సినిమా చూశాను. ఆద్యంతం విపరీతంగా ఎంజాయ్ చేశారు' అన్నారు సీనియర్ నటుడు నరేష్. ఆయన ప్రత్యేక పాత్రలో సంపూర్ణేశ్‌బాబు హీరోగా రూపొందిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. ఈ నెల 27న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. 'ఈ పొలిటికల్ సీజన్‌లో రావాల్సిన సినిమా ఇది. ఇందులో ఎవర్నీ విమర్శించలేదు. రాజకీయాల వల్ల జనం ఎదుర్కొంటున్న సమస్యల్ని కామెడీగా చెప్పడం జరిగింది అంతే. ఇందులో వారసత్వంగా వస్తున్న గ్రామ సర్పంచ్ పదవికోసం తపించే వ్యక్తిగా కనిపిస్తా' అని చెప్పారు నరేశ్.

## కామెడీ కీడా కోలా

'క్రైమ్ కామెడీ నాకు ఇష్టమైన జానర్. కానీ కొన్ని కారణాల వల్ల ఇప్పటివరకూ ట్రై చేయలేదు. 'కీడా కోలా' కథ రాస్తున్నప్పుడు ఈ జానర్ ఎంత కష్టమైందో అర్థమైంది. అయినా సరే ఎంజాయ్ చేస్తూ పని చేశాం' అన్నారు దర్శకుడు తరుణ్ భాస్కర్. ఆయన నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కీడా కోలా'. బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్, జీవన్‌కుమార్ విష్ణు, చైతన్యరావు మదాడి, రాగ్ మయూర్ ప్రధాన పాత్రధారులు. ప్రముఖ హీరో రానా దగ్గుబాటి సమర్పిస్తున్న ఈ చిత్రానికి కె.వివేక్ సుదాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మాతలు. ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ని బుధవారం రానా లాంచ్ చేశారు. తరుణ్ భాస్కర్ ఇంకా మాట్లాడుతూ –' నా మొదటి రెండు సినిమాల విడుదలకు ముందు కొంచెం నెర్వస్‌నెస్ వుండేది. ఈ సినిమా విషయంలో మాత్రం కాన్ఫిడెంట్‌తో ఉన్నాను. ఇప్పటికి సినిమా పదిసార్లు చూశాను. అన్ని వయసులవారూ ఎంజాయ్‌చేసేలా వచ్చింది' అన్నారు. 'కథని బలంగానమ్మి, కథకు కట్టుబడి సినిమాలు తీసే టెక్నీషియన్ తరుణ్ భాస్కర్. సినిమా చూశాను. పొట్ట చెక్కలయ్యేలా నవ్వించాడు. నవంబర్ 3న సినిమాను విడుదల చేస్తున్నాం' అని రానా చెప్పారు. ఇంకా యూనిట్ సభ్యులు కూడా మాట్లాడారు.



చైతన్యారావు, రానా దగ్గుబాటి, తరుణ్ భాస్కర్ తదితరులు



కాజల్ అగర్వాల్



మహేష్‌బాబు

## నేను చాలా సెన్సిటివ్

'విజయం ఒక్కసారిగా రాదు. వచ్చినా స్థిరంగా ఉండదు. శ్రమించి సాధించే విజయం చిరస్థాయిగా ఉంటుంది. దానికోసం శ్రమించాలి. సాహసాలు చేయాలి. అప్పుడుగానీ అసలైన విజయం రాదు' అని నాన్న చెబుతుండేవారు. నేను చేసిన సినిమాలు సరిగ్గా ఆడనప్పుడు నాన్న చెప్పిన మాటలు గుర్తొస్తుంటాయి' అన్నారు మహేశ్‌బాబు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి మహేశ్, నమ్రతా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ ఆసక్తికరమైన విషయాలు మాట్లాడారు. 'నేను చాలా సెన్సిటివ్. సినిమాలు ఆడకపోతే నిరుత్సాహానికి లోనవుతుంటా. అంచనాలు తల్లకిందులైతే కొన్నాళ్ల పాటు ఆ ప్రభావం నాపై ఉండిపోతుంది. అందుకే ఆ సమయంలో ఫ్యామిలీతో ఎక్కువ సమయం గడుపుతాను. ఈ విషయంలో నాన్న పూర్తిగా డిఫరెంట్. ఆయన జయాపజయాల గురించి ఆలోచించరు. చేసుకుంటూవెళ్లిపోవడమే. ఈ క్రమంలోనే అద్భుతాలు సృష్టించబడ్డాయి' అంటూ చెప్పుకొచ్చారు మహేశ్.

## ఈ మూడేళ్ల ప్రయాణాన్ని మరిచిపోలేను



అభిషేక్ అగర్వాల్

'టైగర్ నాగేశ్వరరావు' నా మనసుకు చాలా దగ్గరైన సినిమా. ఈ సినిమాతో నా మూడేళ్ల ప్రయాణం మరిచిపోలేనిది' అన్నారు. నిర్మాత అభిషేక్ అగర్వాల్. రవితేజ కథానాయకునిగా అభిషేక్ నిర్మించిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకుడు. నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ కథానాయికలు. రేణూదేశాయ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ నెల 20న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా అభిషేక్ మీడియాతో ముచ్చటించారు. 'కథ డిమాండ్ మేరకు ఎంత అవసరమో అంత ఖర్చు పెట్టి పేషన్‌తో ఈ సినిమా చేశాం. ఒక దొంగ బయోపిక్ ఎందుకు తీశారు? అని చాలామంది అడుగుతున్నారు. ఆ దొంగలో ఎంతో ఉన్నతమైన కోణముంది. అది రేపు తెరపై చూస్తారు. దీన్ని అందరూ పాన్ ఇండియా సినిమా అంటున్నారు. కానీ నేనొప్పుకోను. ఇప్పుడు సినిమా అంతా ఒకే వేదికపైకి వచ్చింది. కాబట్టి ఇది కేవలం ఇండియా సినిమా. అన్ని రాష్ట్రాల్లో బిజినెస్ పరంగా హ్యాపీగా ఉన్నాం. ఈ సినిమా విషయంలో లీగల్‌గా ఎదురైన ఇబ్బందులు కూడా తొలగిపోయాయి. మా సంస్థ పేరును మరింత పెంచే సినిమా అవుతుంది' అని అభిషేక్ అగర్వాల్ అన్నారు.

## మహిళా శక్తి గురించి చెబుతుంది

'భగవంత్ కేసరి' చిత్రంలో స్త్రీ శక్తి, మహిళా సాధికారత గురించి గొప్పగా ఆవిష్కరించారని, ఇలాంటి స్ఫూర్తివంతమైన కథలో భాగం కావడం ఆనందంగా ఉందని చెప్పింది కాజల్ అగర్వాల్. ఈ సినిమాలో కాత్యాయని పాత్రలో ఆమె కనిపించనుంది. బాలకృష్ణ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలకానుంది. ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ 'కాత్యాయని ఒక సైకాలజిస్ట్. తను చాలా తెలివైన మహిళ. కథాగమనంలో నా పాత్ర కీలకంగా ఉంటుంది. ఈ సినిమాలోని మహిళా శక్తి అనే కాన్సెప్ట్ నాకు వ్యక్తిగతంగా బాగా కనెక్ట్ అయింది. ఆడపిల్లను ధైర్యంగా పెంచాలనే అంశం గొప్పగా అనిపించింది. ఇలాంటి కథ నేటి సమాజానికి అవసరం అనిపించింది' అని చెప్పింది. బాలకృష్ణ సెట్స్‌లో చాలా సరదాగా ఉంటారని, షూటింగ్ అంతా హ్యాపీగా సాగిందని కాజల్ అగర్వాల్ తెలిపింది. 'దర్శకుడు అనిల్‌రావిపూడిలో సెన్సాఫ్ హ్యూమర్ చాలా ఎక్కువ. ఆయన తీసిన 'ఎఫ్–2' 'ఎఫ్–3' సినిమాలు బాగా నచ్చాయి. 'భగవంత్ కేసరి'లో ఆయన శైలి వినోదంతో పాటు సందేశం కూడా ఉంటుంది. ప్రస్తుతం 'సత్యభామ' సినిమా చేస్తున్నా. ఇక 'ఇండియన్–2'లో నా పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. వీటితో పాటు మరికొన్ని చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి' అని కాజల్ అగర్వాల్ చెప్పింది.








